సంపుటి: 12 | సంచిక: 3

మార్చి-ఏప్రియల్ 2024

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



**సిలువ మరణము పొందునంతగా**

**విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను.**

**ఫిలిప్పీయులకు 2:8**



# “మనస్సులోని మాట”

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

దేవునియందు ప్రియులైన స్పర్శ పాఠకులందరికి శుభములు. మీరంతా ఎలా ఉన్నారు? మన ప్రభువు గత రెండు నెలలు మనలను కాపాడి, ఈ మూడో నెలలోకి ప్రవేశపెట్టారు. ఆయన మంచితనము, దయ మనము ఎంత వివరించినను మన జ్ఞానమునకు మించిన ప్రేమ, దయ ఆయన కలిగి ఉన్నారు. కాబట్టి ప్రతి సందర్భములోనూ ఆయన మంచితనాన్ని జ్ఞాపకం చేసుకుంటూ మనము ముందుకు వెళ్ళవలసినవారమైయున్నాము. ఈ లోకములో కలిగిన ఇరుకులు, ఇబ్బందులు, శ్రమలన్నిటిని సహించుకుంటూ దేవుని యొక్క మంచితనాన్ని ధ్యానిస్తూ ముందుకు వెళ్లటం మనం చేయవలసిన ముఖ్యమైన కార్యక్రమం. ఆయన మంచితనం మనకు ఎంత అర్థమైతే అంత సంతోషంగా బ్రతకగలం. కాబట్టి ఈ మనసులో మాట ద్వారా దీనిని చదువుతున్న మీ అందరికి నేను చెప్పే విషయమేమిటంటే ఆయన మంచితనాన్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నం చేయండి. మన జీవితంలో రకరకాలైన వాటిని తెలుసుకోవడం కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తూ ఉంటాము, వాటన్నిటి కంటే మొదటివరసలో వచ్చేది ఆయన మంచితనాన్ని తెలుసుకోవడానికి ఎంత తీవ్రంగా ప్రయత్నిస్తున్నాము. దాని ద్వారా మనం ప్రశాంతతని, ఆత్మీయ జీవితాలలో విజయాన్ని, పరలోకరాజ్యాన్ని, ఆత్మలను సంపాదించడాన్ని వీటన్నిటిని పొందుకోగలం. కాబట్టి మనం పరిశుద్ధ గ్రంథాన్ని ధ్యానించడం ద్వారా, ప్రార్థనలో ఆయనతో సమయం గడపడం ద్వారా ఆయన మంచితనాన్ని అర్థంచేసుకో గలుగుతాము. కాబట్టి ఒంటరి సమయాలలో దేవునితో మాట్లాడటం ద్వారా ఆయన మంచితనం మీ అందరికి అర్థం కావాలని కోరుకుంటున్నాను. చాలామంది దేవునియొద్దకు వస్తారేగాని ఆయన మంచితనాన్ని అర్థం చేసుకోకుండానే వారి జీవితాన్ని వ్యర్థం చేసుకుంటూ ఉంటారు. మీలో ఏ ఒక్కరు అలాగున ఉండకూడదు అని నేను మనస్ఫూర్తిగా కోరు కుంటున్నాను. ఆయన మంచితనం ప్రతి ఒక్కరికి అర్థమయ్యేటట్లు దేవుడు కృప చూపును గాక!

మీ సహోదరుడు.....



సంపుటి: 12 | సంచిక: 3

మార్చి-ఏప్రియల్ 2024

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- దుఃఖమును సంతోషముగా మార్చు దేవుడు ..... 2
- హతసాక్షులు ..... 5
- రాహాబు (స్త్రీల ప్రత్యేకము) ..... 8
- జాన్ వెస్లీ - 25వ భాగం ..... 10
- "పనికిరానిది ఏది" (బాలలశీర్షిక) ..... 12
- నా జీవితంలో దేవుడు చేసిన మేలులు ..... 14
- చివరి మాటలు ..... 16
- మనస్థత్త్వ విధానములు ..... 19
- దైవచిత్తాన్వేషణ (తెలుగు) ..... 22
- Finding Gods Will (English) ..... 24
- బైబిల్ క్విజ్ -93 ..... 26
- జన్మదిన శుభాకాంక్షలు ..... 27


మా చిరునామా :

ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227



# దుఃఖమును సంతోషముగా మార్చు దేవుడు

బ్రదర్. ఎపఫ్రా

**"హన్నా తనకు ప్రియముగా నున్నందున ఆమెకు రెండుపాళ్లు ఇచ్చుచు వచ్చెను. యెహోవా ఆమెకు సంతులేకుండచేసెను. యెహోవా ఆమెకు సంతులేకుండ చేసియున్న హేతువునుబట్టి, ఆమె వైరియగు పెనిన్నా ఆమెను విసికించుటకై, ఆమెకు కోపము పుట్టించుచు వచ్చెను. ఎల్కానా ఆమెను ఏటేట ఆరీతిగా చేయుచు నుండగా హన్నా యెహోవా మందిరమునకు పోవునప్పుడెల్ల అది ఆమెకు కోపము పుట్టించెను గనుక ఆమె భోజనము చేయక ఏడ్చుచు వచ్చెను." 1సమూ 1:5-7**

బైబిల్ గ్రంథములో హన్నా అనే ఆమె తన భర్తకి ప్రియమైనదిగా ఉంది. అతను ఆమెను ప్రేమించుచున్నప్పటికి ఆమెకు సంతానం లేని కారణము వలన, తనకు కలుగుచున్న అవమానమునుబట్టి యెహోవా మందిరమునకు వెళ్ళినప్పుడెల్లా భోజనము చేయక ఏడ్చుచూ ఉండేది.

అక్కడ హన్నా సంతానము లేక ఏడుస్తూ ఉంటే, ఇక్కడ మాట వినని బిడ్డలు, మారని వ్యక్తుల కొరకు లేదా కుటుంబ పరిస్థితుల గురించి, కుటుంబములో ప్రియమైన వారిని పోగొట్టుకున్న వారికొరకు ఏడుస్తూ ఉండి ఉండవచ్చు. జీవితంలో ఏడ్చే పరిస్థితులు చాలా సర్వసాధారణమైనది. రెండు రకాలైన దుఃఖాలు ఉంటాయి, ఒకటి ఈ లోకంలో శరీర సంబంధమైన దుఃఖం, రెండవది ఆత్మానుసారమైన దుఃఖము లేక దైవచిత్తానుసారమైన దుఃఖము. ఈ దైవచిత్తానుసారమైన దుఃఖము మనలను రక్షణలోనికి నడిపించే రక్షణార్థమైన మారుమనస్సును కలుగుజేస్తుంది. ఆత్మానుసారమైన దుఃఖము మన జీవితాన్ని దేవునికి అత్యంత సమీపంగా మారుస్తుంది. ఈ ఆత్మసంబంధమైన దుఃఖం ఎప్పుడూ మనకి ప్రయోజనకరమే. దానివల్ల మనకి ఎటువంటి నష్టమూ ఉండదు. కానీ ఈ లోకానుసారమైన, శరీరానుసారమైన దుఃఖము మన జీవితాల్ని కృంగదీస్తుంది. మనలో ఏ దుఃఖము ఎక్కువగా ఉంటుంది? ఒకరిలోనూ, ఇద్దరిలోనూ కాదు లోకంలోని మనుష్యులను మనం చూస్తే, లోకానుసారమైన దుఃఖమే ఎక్కువగా ఉంటుంది. అది అనారోగ్య, ఆర్థిక, వ్యక్తిగత పరిస్థితులనుబట్టి కలిగే దుఃఖము, మరికొన్నిసార్లు ఆత్మీయజీవితంలో ఉన్న అపజయాల వలన కలిగే దుఃఖము.

మనం ఏడ్చిన చోట నవ్వేటట్లుగా, పడినచోట లేపి మరల నిలబెట్టగలిగినవారు,

 ఆస్థిపాస్తుల కన్నా నోట్లో నాలుకని భద్రంగా ఉంచుకోవడం...కష్టం.

ఓడిపోయినా మరలా గెలిపించగలిగేవారు ఈ లోకంలో ఎవరూ లేరు కానీ ఒకే ఒక్కరు ఉన్నారు ఆయనే మన ప్రభువైన యేసుక్రీస్తు.

ఒకరోజు మందిరములో ఏడుస్తున్న హన్నాను చూచి, దైవజనుడైన ఏలీ ఆమె మద్యము మత్తులో ఉందని భావిస్తాడు అంటే ఆమె దుఃఖము అంత అధికముగా ఉంది. దేవుడు ఆమె గర్భమును తెరిచి కుమారుని అనుగ్రహించి ఆమె దుఃఖమును సంతోషముగా మార్చారు. అంతేకాక ఆ కుమారునిని ప్రవక్తగా స్థిరపరిచి, అతనికి తోడైయుండి నడిపించారు.

**"సమూయేలు పెద్దవాడు కాగా యెహోవా అతనికి తోడైయున్నందున అతని మాటలలో ఏదియు తప్పిపోలేదు. కాబట్టి సమూయేలు యెహోవాకు ప్రవక్తగా స్థిరపడెనని దాను మొదలు కొని బెయేర్షెబా వరకు ఇశ్రాయేలీయులందరు తెలిసికొనిరి. " (1సమూ 3:19,20)**

హన్నాకు పుట్టిన కుమారుడైన సమూయేలుని ఎలాగున దేశములో అత్యున్నతమైన స్థానములో నిలబెట్టాడో, మన దేవుడు మనలను నిలబెడతారు అని విశ్వసించాలి. పరిస్థితు లనుబట్టి ఏడుస్తూ, నిరాశ అనే ఊబిలో దిగబడి, కృంగిపోయి, సాతాను చేతుల్లోకి వెళ్తూ, అపవాది ఆనందించడానికి అవకాశం ఇవ్వకూడదు. యేసయ్య ఎంతో మంచివాడు, ప్రేమ గలవాడు, శక్తిమంతుడు. మనకొరకు ఆయన ఉద్దేశించిన ఉద్ధేశ్యములు ఎంతో ఉన్నత మైనవి. వాటిని ఆయన ఎన్నడూ విరమించుకోడు. మనకొరకు ఆయన ఏర్పాటుచేసిన ప్రణాళిక అత్యంత గొప్పది. ఆ ప్రణాళికను ఆయన రద్దుపరచడు. ఆయన మాట ఇచ్చి నెరవేర్చే దేవుడు, మీతో చెప్పిన ప్రతి మాట తప్పక నెరవేర్చును.

**"దేవుడు చెప్పిన యేమాటయైనను నిరర్థకము కానేరదని ఆమెతో చెప్పెను." లూకా 1:37**

ఇశ్రాయేలుగా మార్చబడిన యాకోబు, దేవునితో పోరాడి గెలిచిన యాకోబు. ఇతడు తన కుమారుడైన యోసేపుకొరకు ఎంతగానో ఏడుస్తున్నాడు.

**"అతని కుమారులందరును అతని కుమార్తెలందరును అతనిని ఓదార్చుటకు యత్నము చేసిరి; అయితే అతడు ఓదార్పు పొందనొల్లక -నేను అంగలార్చుచు మృతుల లోకమునకు నా కుమారుని యొద్దకు వెళ్లెదనని చెప్పి అతని తండ్రి అతని కోసము ఏడ్చెను. మిద్యానీయులు ఐగుప్తునకు అతనిని తీసుకుపోయి, ఫరోయొక్క ఉద్యోగస్థుడును రాజసంరక్షక సేనాధిపతి యైన పోతీఫరునకు అతనిని అమ్మివేసిరి." ఆది 37:35,36**

అన్నలచేత అమ్మివేయబడిన యోసేపు అవమానములు, నిందల మధ్యలో చెరసాలలో వేయబడ్డాడు. ఏ కుమారుడి కొరకైతే యాకోబు దుఃఖించాడో, ఆ కుమారుడిని దేవుడు హెచ్చించి, ఐగుప్తు ప్రధానిగా చేసి, తండ్రి అతనినిబట్టి సంతోషించేటట్లుగా చేశాడు. ఏ వ్యక్తి అయితే అవమానములలో, నిందలలో బ్రతికాడో, ఆ వ్యక్తిని(యోసేపు) ఉన్నతమైన

స్థానమునకు నడిపించారు. అవమానమునకు ప్రతిగా రెట్టింపు ఘనతను, అవమానములో నుండి అత్యున్నత సింహాసనమునకు నడిపించగల దేవుడు మన దేవుడు.

ప్రభువైన యేసుక్రీస్తుని సిలువలో వ్రేలాడదీయడానికి తీసుకొనిపోతున్నప్పుడు, కొరడాలతో కొట్టి, ఆయన చర్మం అంతా కూడా చీల్చబడుతూ ఉంటే, అక్కడ ఉన్న మనుష్య లందరి మధ్యలో ఓడిపోయిన వాడిగా మిగిలిపోయాడు. అనేకులకు ఓడిపోయినట్లుగా కనబడిన ఆయనను దేవుడు లేవనెత్తి అన్ని నామములకంటే పై నామముగా హెచ్చించారు. మనము ధైర్యం తెచ్చుకోవాలి జయమిచ్చువాడైన యేసు మనకు ఉన్నాడు.

లెమ్ము..తేజరిల్లుము..మేల్కొనుము...

నీ శ్రేష్టమైన జీవితాన్ని అపవాది చెప్పే అబద్ధాలకు తాకట్టు పెట్టక ఈలాగు చెప్పాలి

. **"నా శత్రువా, నా మీద అతిశయింపవద్దు, నేను క్రిందపడినను, తిరిగిలేతును; నేను అంధకారమందు కూర్చున్నను యెహోవా నాకు వెలుగుగా నుండును." మీకా 7:8**

నీ జీవితాన్ని యేసుకు అప్పగించుకో, నీ కార్యాన్ని ఆయన నెరవేర్చి తన నామమును మహిమపరచుకుంటారు. నయోమి అంతా అయిపోయింది అనుకుంది రూతును వెళ్లి పొమ్మని చెప్పింది, ఆమె తన తల్లి ఇంటికి తిరిగి వెళ్లకుండా నీ దేవుడే నా దేవుడు అని తన అత్తయైన నయోమిని, దేవుడిని హత్తుకొని జీవించడం వలన మోడుబారిన ఆమె జీవిత మును దేవుడు ఫలింపజేశారు. యేసుప్రభువు వంశావళిలో రూతు చేర్చబడునట్లుగా ఆమె జీవితాన్ని దేవుడు హెచ్చించాడు. హన్నా, యోసేపు, యేసుప్రభువు, రూతు జీవితాలవలే మన జీవితాలు కూడా అనేకులకు ప్రయోజనకరంగా మార్చబడతాయి, ఈ మాటని మనం విశ్వసించాలి.

**నీ దుఃఖం కొట్టివేయబడి, సంతోషం దయచేయును గాక!! ఆమెన్**

**ముఖ్య గమనిక:**

మీ ప్రార్థనావసరతలకై ఎపఫ్రా మినిస్ట్రీస్ ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.00 గం॥ల నుండి సాయంత్రం 6.00 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

# హతసాక్షులు

## వెరోనికా లోహన్స్

(గడచిన సంచిక తరువాయి భాగం)

కొంతవరకు వేరు దేశములను చూచి రావాలి అనునది నా తలంపుగా ఎప్పుడు లేదు. నా తలంపు ఏమిటంటే నన్ను నేను రక్షకునికి సమర్పించుకోవాలి అనునదైయున్నది. డెన్‌మార్క్ నుండి కౌంటు తిరిగి వచ్చి, బానిసల యొక్క దీనస్థితిని గురించి చెప్పినప్పటి నుంచి వారిని మరచిపోలేకపోతున్నాను. ఇంకా ఎవరైనా నాతో రాగలిగితే, నేను ఒక బానిసనై, రక్షకునిని గురించి నాకు తెలిసినంతవరకు వారికి చెప్పాలని అనుకుంటున్నాను. ఎందుకనిన ఎట్టి దీన పరిస్థితిలో ఉన్నప్పటికీ, సిలువను గూర్చిన వార్త వారిని రక్షిస్తుంది అని నేను నమ్ముతున్నాను అని వ్రాశాడు.

యవ్వనస్తుల యొక్క సంగీత బృందము యొక్క నాయకునికి లియోనార్డ్ హెరెన్‌హాట్ విడిచిపోవుట ఇష్టములేదు. అతను చాలా మంచి యవ్వనస్తుడు. దేవుని యెడల తనకున్న భక్తి మరియు పనిలో తనకున్న నిపుణతను బట్టి చాలా మంచి యువకుడు. గనుక అతనిని పంపుటకు ఇష్టపడలేదు కానీ ఒక సంవత్సరము గడచిన పిదప, తన భవిష్యత్తును గురించి చీట్లు వేయుటకు సంఘము అంగీకరించింది. ఆ చీట్లలో తాను తీసిన చీటీలో ఈ విధముగా ఉండినది, 'ఈ యవ్వనస్తుని వెళ్లనివ్వండి, వెళ్లుటకు డేవిడ్ నిచ్‌మాన్' ఏర్పాటుచేయ బడ్డాడు. ఈ ఇద్దరు యవ్వనస్తులు కూడా భయముతో మరియు ఉత్సాహముతో కొబ్బరి చెట్లతో నింపబడిన సెయింట్‌థామస్ ద్వీపమును డిసెంబర్ 13,1732వ సంవత్సరమున చేరారు. ఈ ద్వీపము ఇటీవల ఫ్రాన్స్ నుండి కొనబడిన ద్వీపము. ఈ ద్వీపముతో సెంటు క్రొయక్స్ మరియు సెంటు జాన్ ద్వీపములు కూడా కొనబడినవి. వెస్ట్ ఇండీస్‌లోనున్న ఈ ద్వీపములు ధనవంతమైనవై, డెన్‌మార్క్ దేశమునకు చక్కెర మరియు పొగాకు సమకూ ర్చాయి. పునరుద్ధరింపబడిన డచ్చి కుటుంబములు, 150తోటలకు స్వంతదారులగా, విశా లమైన భవంతులలో నివసించుచు ఉన్నారు. వారిచుట్టూ పేము కట్టతో కప్పబడిన, మట్టి గుడిసెలలో నల్లజాతి బానిసలు నివసించుచుండెడివారు. వారు అట్టి అధోగతికి వారి భాగ మైయున్నదని నమ్మినవారు. ప్రతినెల కూడా ఆఫ్రికా నుండి పట్టుబడిన నల్లజాతివారు సెయింట్ థామస్ సముద్ర తీరమునకు తేబడేవారు. ఒకవేళ దారి మధ్యలో వారు అనారోగ్య మునకు గురైనచో వారిని సముద్రములో పడవేసేవారు. తద్వారా ఆహారము, నీరు పొదుపు చేయబడుతుందని తలంచేవారు. ఆ ప్రయాణములో బ్రతికినవారు, బక్కచిక్కిపోయిన పరిస్థితిలో, భయముతో నింపబడిన చూపులతో తీసుకొనిరాబడి, క్రైస్తవ భూస్వాముల వద్దకు తేబడేవారు, వారిని వెంటనే పనిలోకి పంపిచేవారు.

మెళకువ కలిగిన జాన్ బోరమ్ నాయకత్వములో, సంస్కరణ కలిగిన ఒక పాస్టరుగా, అందరిని వారివారి స్థానములలో ఉంచేవాడు. బానిసలు వారి యజమానులకు లోబడే వారిగా, వారి యజమానులు దేవునికి మరియు సంఘమునకు జవాబుదారులుగా ఉండు లాగున చేశాడు. నల్లజాతివారు కొంత స్వాతంత్రమును కలిగియుండిరి కానీ వారికి ఎటువంటి గొప్ప సౌకర్యములు లేవు. ఎటువంటి గృహోపకరణములు లేక, పరుపులు, సరియైన వస్త్రములు, వంటసామాగ్రి లేనందువలన, బానిసలు నేలపై పరుండి, వారి ఆహారమును చేతులతో తినవలసియుండినది. అంటువ్యాధులు, కుష్టరోగము, వాతముతో దవడ కదలక పోవుట అను వ్యాధుల వలన వారు మరణించేవారు. ఎక్కువమంది నల్లజాతి బానిసలు అనగా ఒక్క తెల్లజాతి వానికి, ఆరుగురు నల్లజాతివారు ప్రకారము లెక్కకు ఎక్కువమంది నల్లజాతివారు ఉండుటనుబట్టి, తెల్లజాతి అధికారులు ఎప్పుడు తిరుగుబాటు జరుగునో అనే భయముతో జీవించుచుండెడివారు.

సెయింటు థామస్ ద్వీపములో ఉన్న న్యాయచట్టము ప్రకారము యజమానిపై తిరుగుబాటు చేసిన బానిస చేతులు నరికివేసేవారు. ఎవరైనా పారిపోవుటకు ప్రయత్నము చేసి పట్టుబడినయెడల ఒక పాదము నరికివేసేవారు. తరువాత మరల రెండవసారి అట్టి ప్రయత్నము చేసినచో రెండవ పాదము కూడా నరికివేసేవారు. తరువాత ఒక కాలు, రెండవ కాలు కూడా తీసివేసేవారు. ప్రతి వారము కూడా కొరడా దెబ్బలు కొట్టేవారు. చట్ట అనుమతి ప్రకారము ఐదువందల కొరడాదెబ్బలు కొట్టవచ్చు, ఇది మరణ శాసనమునకు సమానము. కొరడాదెబ్బలు కొట్టిన తరువాత ఆ గాయములలో ఉప్పు, మిరియాలపొడి వారి యజమానులు రుద్దేవారు.

సెయింట్ థామస్ ద్వీపము యొక్క చట్ట ప్రకారము బానిసలు ఎవరైనా తిరుగుబాటు చేసినచో వారిని వెంటనే చంపేయాలని ఉండినది. అంతేకాకుండా తలతీయబడిన లేక ఉరి తీయబడిన ప్రతి బానిస నిమిత్తం, ఆ బానిస యజమానికి ప్రభుత్వం కొంత ధనమును పరిహారంగా ఇచ్చేది. అదే చట్టము (ఆదివారము) ప్రభువు దినమున పని చేసినవారు, 50 పౌండ్ల పొగాకు చెల్లించవలసి ఉండినది. తెల్లజాతి వారందరు ఆదివారము ఆరాధనకు వెళ్ల వలెనను చట్టం ఉండేది. దురాశ, భయము ఇవన్నీ కూడా దేవుని పేరట జరుగు అకృత్యాలు. హరన్‌హట్ నుంచి వచ్చిన ఇద్దరు యవ్వనస్తులు ఈ కార్యములలో తమ స్థానము ఏమిటని ఆలోచించసాగారు. లియోన్‌హార్డ్ మరియు డేవిడ్ బానిసలుగా తమ్మును తాము అమ్ముకోలేకపోయారు. ఎందుకనిన డచ్చి ప్రభుత్వ చట్ట ప్రకారము తెల్లజాతి వారు బానిసలుగా అమ్మబడకూడదు. అయితే డచ్చివాడైన ఒక తోటయజమాని, నిర్మాణములో ఉన్న తన గృహమును పూర్తిచేయుటకు ఒక స్థలమును కేటాయించాడు. వారికి వచ్చిన మొట్టమొదటి

సమయములో ఆన్‌టోన్ నుండి పొందిన ఉత్తరముతో వారి సోదర, సోదరీమణులను కనుగొనుటకు బయలుదేరారు. వారిని ఆ ద్వీపమునకు ఉత్తరదిక్కులో కనుగొన్నారు. యూరప్ నుండి వచ్చిన వారి సోదరులను కలుసుకొనుటకు ఆశ్చర్యచకితుల య్యారు. అంతేకాకుండా లియోన్‌హార్డ్ చెప్పిన రక్షకుని యొక్క కథలను ఆసక్తితో విన్నారు. వారి కుటుంబములోని వారిని, స్నేహితులను కూడా వినుటకు పిలిచారు. లియోన్ హార్డ్ జర్మన్, డచ్చి భాషలను కలిపి మాట్లాడుట వారు ఎక్కువగా అర్థము చేసుకోలేక పోయినను, పేదల కొరకైన క్రీస్తుసువార్తను విని తమ జీవితములను ప్రభువుకు సమర్పించుకొన్నారు.

బానిసలలో వచ్చిన ఈ మేలుకొలుపు చాలా త్వరితగతిని అందరికి వ్యాపించింది. ఆ ద్వీపములో ఉన్న తెల్లవారు, ఆశించని విధంగా త్వరితగతిని వ్యాపించింది. ఈ బానిసలను కలిగి ఉన్న తెల్లజాతి క్రైస్తవ యజమానులు దోషులుగా తలంచుకొన్నారు. చాలా మంది వ్యభిచారులుగా జీవించుచుండినవారు. నల్లదయ్యాలైన మీరు, సువార్త బోధల ప్రకారము ఎట్లు జీవించగలరు? తెల్లవారమైన మాకు ఈ సువార్త ఇవ్వబడినను దాని ప్రకారము జీవించలేకపోతున్నాము అన్నారు. కొంతమంది బానిసల యజమానులు వారి క్రైస్తవ్యమును బట్టి మరియు వారు వారి బానిసలను మంచిగా చూచుకొనుచున్న విధమునుబట్టి, ఈ దైవసేవకులు వారిపై ఆధిపత్యము చూపుచున్నట్లు భావించారు. 'మా వద్దనున్న బానిసలు సంతోషంగా ఉన్నారు'. 'ఆఫ్రికాలో వారు ఉన్న పరిస్థితికన్నా ఇక్కడ మంచిగా ఉన్నారు. మీరు వచ్చి ఎందుకు వారిని అసమ్మతులను చేస్తున్నారు' అన్నారు.

కొంతమంది యజమానులు, వారి బానిసలు మొరావియన్ కూటములకు హాజరైనందుకు వారిని కొరడాలతో కొట్టించారు. వారి వద్ద పుస్తకములు ఉన్నట్లయితే, వారు చదువు నేర్చు కొనుట చూచినట్లయితే, వారినుండి పుస్తకములు లాగివేసేవారు. ఒక బానిసల యజమాని, ఆ పుస్తకములను కాల్చివేసి, ఆ బూడిదను బానిస ముఖముపై వ్రాసేవాడు. ఆ విధముగా బానిస చదవడము నేర్చుకుంటాడు అని అనేవాడు. మారుమనస్సు పొందిన బానిసలను ఇతర వెస్ట్ ఇండియన్ ద్వీపములకు అమ్మివేసేవారు. తద్వారా క్రైస్తవ సహవాసము నుండి వారిని వేరు చేసేవారు. అంతేకాకుండా, తాగిన మత్తుతో క్రైస్తవ కూటములను అడ్డుకునేవారు.

**సేకరించబడింది**

**ఇంకా ఉంది**

# రాహాబు

సిస్టర్. విజయ

**విశ్వాసమునుబట్టి రాహాబను వేశ్య వేగులవారిని సమాధానముగా చేర్చుకొనినందున అవిధేయులతో పాటు నశింపకపోయెను. హెబ్రీ 11:31**

పైన ఉన్న వాక్యములు విశ్వాసమునుబట్టి అని వ్రాయబడుట మనము గమనిస్తున్నాం. విశ్వాసము అనగా నిరీక్షించుచున్న వాటి యొక్క నిజస్వరూపం. నేడు అనేకులకు విశ్వాసము అనేదానికి అర్థంకూడా తెలీదు. లేనిదానిని ఉన్నట్లుగా భావించేది విశ్వాసము.

జీవితములో వినిన మాటలనుబట్టి విశ్వాసము అనే దానిని సంపాదించుకుంటాం. రాహాబు అనే స్త్రీ వేశ్య, సమాజములో అందరిచేత తృణీకరింపబడినది, ఏ మాత్రమూ విలువ లేనిది. ఆమె ఇల్లు యెరికో ప్రాకారపు గోడపైన కట్టబడివున్నది. ఆ గోడ ఇంచు మించు 30అడుగుల ఎత్తు. ఇశ్రాయేలీయుల కానాను ప్రయాణంలో యెరికో అనే పట్టణము అడ్డుగా ఉన్నది. అందుకు వారు ఆ యెరికోను జయించి ముందుకు వెళ్ళాలని ప్రయత్నిస్తూ యుద్ధం చేయడానికి ముందు ఇద్దరు వేగులవారిని అక్కడికి పంపడం జరిగింది. వారు ఆ పట్టణంలోనికి ప్రవేశించి రాహాబు ఇంట బసచేశారు. **"అప్పుడు రాహాబు వారితో- యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నాడనియు, మీ వలన మాకు భయము పుట్టెననియు, మీ భయము వలన ఈ దేశనివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును. మీ యెదుట యెహోవా సముద్రము నీరు ఏలాగు ఆరిపోచేసెనో, శత్రురాజులను మీరేలాగు నిర్మూలము చేసితిరో మేము వినినప్పుడు మా గుండెలు కరిగిపోయెను. మీ దేవుడు పైన ఆకాశమందును, క్రింద భూమియందును దేవుడే మీ ఎదుట ఎట్టి మనుష్యులకైననూ ధైర్యము ఏ మాత్రము ఉండదు"** అని చెప్పింది. ఈ సమాచారం నాయకుడైన యెహోషువకు ఎంతో ప్రోత్సాహ మును ఇచ్చింది. రాహాబు ఒక వేశ్యే కానీ ఆమె కలిగి ఉన్న విశ్వాసం, తన మాటలు మరియు క్రియల ద్వారా వెల్లడి అయినప్పుడు ఆమె ఎంతో ఉపయోగకరంగా ఉంది.



దేవుని దృష్టిలో రాహాబుకు యెరికో పట్టణస్థులకు ఉన్న వ్యత్యాసం ఏమిటి? రాహాబు యొక్క విశ్వాసం దేవుని దృషిలో ఎందుకు ఘనమైనది? క్రొత్త నిబంధన గ్రంథములో కూడా

ఆమె విశ్వాసం గూర్చి జ్ఞాపకం చేయడం జరిగింది. బాల్యము నుండి ఆయనను ఎరుగక పోయినప్పటికిని, ఆ దేవుని గురించి మాట వినగానే దృఢంగా ఆయనను నమ్మగలిగింది. యెరికో ప్రజల యొక్క ఆలోచనా విధానం దీనికి పూర్తి విరుద్ధమైనది. వారు నిజదేవునిని ఎంతమాత్రం నమ్మినవారు కారు. దేవుని ప్రజలను పూర్తిగా వ్యతిరేకించినవారు. అందుకే యెరికో పట్టణం మొత్తంలో రాహాబు ఇల్లు ఒక్కటే సురక్షిత ప్రదేశంగా ఉంది. ఎర్రని దారం అనగా రక్తరంగు దారం, బలి అర్పణ మూలంగా కలిగిన భద్రతను సూచిస్తూ ఉంది.

**(నిర్గమ 12:7-13)**

రాహాబు తన విశ్వాసమునుబట్టి తన కుటుంబ సభ్యులందరికి రక్షణ సాధనంగా ఉండ గలిగింది. ఆ పట్టణములో గొప్ప గొప్ప జ్ఞానవంతులు, ధనవంతులు యుద్ధశూరులు ఉన్నారు, వారు ఎవ్వరూ కూడా వారి కుటుంబములను కాపాడుకోలేకపోయారు. యెరికో పట్టణం వెండి, బంగారం, ఇత్తడి, వెలగలిగిన సమస్తము నశించిపోవడం కనబడుతూ ఉంది. రాజ్యమును పరిపాలన చేసే రాజులకు సహితము దొరకని ఈ భాగ్యము ఆమెకు, ఆమె ఇంటి వారికి దొరికింది.

క్రొత్త నిబంధన ప్రజలమైన మనము రాహాబు ద్వారా నేర్చుకొనవలసినది ఎంతో ఉంది. ఆమె గొప్ప జ్ఞానవంతురాలు కాకపోయిన, ఉన్నతమైన కుటుంబ నేపథ్యములో నుండి రాక పోయిన సత్య దేవునిగూర్చి వినిన దానిని విశ్వసించడం ద్వారా తాను తన ఇంటివారును రక్షింపబడ్డారు. అంతమాత్రమే కాక రాహాబు మన పితరుడైన దావీదుకు పూర్వీకురాలు **(మత్తయి 1:5)** దావీదు వంశములోనే మన ప్రభువైన యేసుక్రీస్తు పుట్టడం జరిగింది. ఎంత ధన్యత! ఒక వేశ్య హీనమైన స్థితి నుండి ఎలా ఉన్నతమైన స్థితికి చేరుకుందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

చాలామంది స్త్రీలు తమవైపు తాము చూచుకుంటూ నాకు జ్ఞానం లేదు, ఏదీ రాదు, మంచి దానిని కాను అని తలంచుచు, స్వనీతితో బ్రతుకుతూ ఉంటారు. కృప అనగా అర్హత లేనివారిని అర్హులుగా చేసేది. తమని తాము హీనపరుచుకునేవారు కృపని తృణీకరించు చున్నారు అనే సంగతిని గ్రహించాలి. కనుక మన నీతినిబట్టి కాక మనము దేవునియందు ఉంచు విశ్వాసమునుబట్టి కృపచేతనే రక్షించబడుచున్నాము. రాహాబు పాతనిబంధనా కాలంలో అపాయం నుండి రక్షించబడితే, నేడు నూతననిబంధనా ప్రజలుగా యేసుక్రీస్తుని గూర్చిన సిలువ, మరణ, పునరుత్థానములను గూర్చి మనము విశ్వసించిన యెడల భయంక రమైన నాశనం నుండి తప్పించబడి అనగా నిత్య అగ్నిగుండములో నుండి నిత్య జీవము లోనికి చేర్చబడతాము.



# జాన్ వెస్లీ

**– సీరియల్ 25వ భాగము**

క్రీస్తుయొక్క ఆత్మగాని, ప్రేమగాని, క్రియలుగాని ఎక్కడను కనబడలేదు. ఎక్కడో ఒక నమ్మకమైన పాదిరి ఉండేవాడు గాని అట్టివారు చాలా అరుదుగా కనబడెడివారు. ఇట్లు ప్రబలిన దుష్టత్వములో ప్రజలు మునిగియుండగా పాదిరిలు ఏమియు చేయలేకపోయిరి. ఇట్టి పరిస్థితిని మార్చగలమని లేక బాగుచేయగలమని యోచించువాడే లేకపోయెను గాని మార్చబడిన వెస్లీతో సిలువవేయబడిన క్రీస్తు ఉండెను. ఆయన ఎంతటి పాతకులనైనను మార్చగలడు. శపించుచు, దుర్భాషలాడుతూ నరకదారి పట్టిన భక్తిహీనుల సమూహము లను చూచినపుడు వెస్లీ హృదయము క్రీస్తు కనికరముతో కరిగిపోయెడిది. నోట నుండి సువార్త ప్రవాహమువలె బయలువెళ్లెను. సైతాను వశములోనున్న సమూహములు ఆయన స్వరము విని, ఆగి ఆలకించిరి రక్తము కారుచున్న దేవుని గొఱ్ఱెపిల్లవైపు తమ దృష్టిని మరల్చి రక్షణను పొందసాగిరి.

వెస్లీ ఉత్తరముననున్న న్యూక్యాసిలుకు పయనమయ్యెను. త్రాగుడు, దూషణ, బూతులు, చెప్పరాని శాపోక్తులను ఉచ్చరించు ప్రజలను జూచెను, పిల్లలకు కూడా ఈ భాషయే. ఇట్టి దుస్థితిని చూచి వెస్లీ నిరుత్సాహపడలేదుగాని నీతిమంతులనుగాక మారుమనస్సు పొందు టకు పాపులను పిలువవచ్చిన క్రీస్తు యొక్క క్రియను చూచుటకు ఇదే మంచి తరుణము అని యోచించి, ఇచ్చటి ప్రజలకు క్రీస్తును బోధించెను. న్యూక్యాసిలులో పేద ప్రజలు నివసించు ప్రాంతమందు వీధిలో నిలువబడి జాన్‌వెస్లీ, తోటిసహోదరులు నూరవ కీర్తనను పాడసాగిరి. వీరెవరో చూడగోరి ముగ్గురు నలుగురు బయటకు వచ్చిరి. త్వరలో వారి సంఖ్య 400 నుంచి 500లకు హెచ్చెను జాన్‌వెస్లీ ప్రసంగింపనారంభించెను. ప్రసంగము ముగియునప్పటికి 1500మంది ఉండిరి. **"మన యతిక్రమక్రియలనుబట్టి అతడు గాయపరచబడెను మన దోషములనుబట్టి నలగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీదపడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది." యెషయా 53.5** అను వాక్యముపై ప్రసంగించెను. ప్రసంగానంతరమున ప్రజలు ఆశ్చర్యచకితులై దీక్షతో ఆయనను వీక్షించు చుండిరి. "నా పేరు జాన్‌వెస్లీ మరల రేపు సాయంకాలము 5 గంటలకు దేవుని సహాయ ముతో తిరిగి ఆ కొండమీద ప్రసంగించెదను" అనెను.

మరునాడు 5గంటలకు ఆ కొండపైనుండి క్రింది వరకు జన సమూహముతో కప్పబడి యుండెను. ఆ సమూహమంతటికి తన స్వరము వినబడునా!యను సందేహము కలిగెను. అయినను వారి మధ్య నిలువబడి వారు విశ్వాసఘాతకులుకాకుండా నేను వారిని గుణ పర చుదును....మనస్ఫూర్తిగా నేను వారిని స్నేహింతును' అను వాక్యము మీద బోధించెను. ప్రజలు దేవుని వాక్యముచేత బహుగా ఆకర్షించబడి జాన్‌వెస్లీని వదలకుండ ఆయనను చుట్టుముట్టిరి. అతి కష్టముతో వారి మధ్యనుండి తప్పించుకొని ఇల్లు చేరెను. మరికొన్ని దినములైనను వారితోనుండి బోధించమని బ్రతిమాలిరి. కాని అప్పుడది సాధ్యము కాలేదు.

రానైయున్న దినములలో జాన్‌వెస్లీ దేశమందంతట పయనించి దేవుని వాక్యమును బోధించెను. ప్రతి గ్రామమునకు ప్రతి పట్టణమునకు సువార్త వినిపించెను. తన మొదటి ప్రసంగమును తెల్లవారి 5 గంటలకే ఆరంభించెడివాడు. స్త్రీ పురుషులు వర్షమైనను, తీవ్రమైన చలియైనను, మంచుయైనను లెక్కచేయక వేకువజాముననే సమకూడెడివారు. వెస్లీ తన జీవిత కాలమందు 226000మైళ్లు ప్రయాణము చేసెను. అనగా భూమి చుట్టూ 9సార్లు ప్రయాణించుటతో సమానము. జాన్‌వెస్లీ ప్రసంగించునపుడు స్త్రీ పురుషులు దేవుని దివ్య ప్రభావములోనికి వచ్చెడివారు. ఆయన దేవుని ఆత్మపూర్ణుడైన పిదప గనులలో పనిచేయు కూలివారికి ప్రసంగించుచుండగా ఒకస్త్రీ బహుగా పాపపశ్చాత్తాప వేదనలో మునిగెను. ఆ భయంకరమైన దుఃఖమునుండి విడుదల పొందు దారి గానక బహు బాధలో మునిగెను. మూడు దినముల పర్యంతము ఆమెను ఎవరును ఓదార్చలేకపోయిరి. ఆమె భర్త ప్రార్థనకై పాదిరిగారిని పిలిచెను. అమ్మో! ఇది పిచ్చి, వైద్యుని పిలిపించండి అని ఆయన వెళ్లి పోయెను. డాక్టరు గారికి ఏమి వైద్యము చేయవలెనో బోధపడలేదు. అప్పుడు దేవుడే తన రక్షణను ఆమెకు బయలుపరచి పాపములను క్షమించి ఆమె ఆత్మను స్వస్థపరచెను.

అటు పిమ్మట మారుమనస్సు అను సత్యమునకు బహు విరోధియైన ఒక స్త్రీ దేవుని ఆత్మచే దర్శించబడెను. పాపక్షమాపణనొసగు దేవుని మహాకృపకు ఆమె సాక్షిగా మారెను. మరి యొక స్త్రీ కోపముతో ఈ కూటములను, బోధ, మార్పులను పూర్తిగా వ్యతిరేకించి, ఎంత వాక్య ఋజువు చూపినను అంగీకరించలేదు, వెస్లీ ఆమెతో ప్రార్థించగోరెను, దానికామె సమ్మతించి మోకరించి, ప్రార్థన మొదలుపెట్టిన కొద్ది నిమిషములకు దేవుని ఆత్మ ఆమెపై క్రుమ్మరించబడి, తన పాపములకై బహుగా వేదనచెందుతూ, దేవునికి మొఱ్ఱపెట్టెను. దేవు డామెను విడిపించెను. ఆ గడియ నుండి ఆమె సాక్షియాయెను.

**సేకరించబడింది**

**(ఇంకా ఉంది)**



# “పనికిరానిది ఏది?”

హలో పిల్లలూ! ఎలా ఉన్నారు? Exams దగ్గరకి వస్తున్నాయి కదా బాగా చదువుతున్నారా? మంచి మార్క్స్ తెచ్చుకోవాలని Plannedగా చదువుతున్నారా? భయపడుతున్నారా? దేవునికి ప్రార్థన చేయడం మరచిపోవద్దు... Time లేదని సాకులు చెప్పవద్దు. time waste చేసే వాటికి దూరంగా ఉండండి. పరీక్షల్లో మంచి ఫలితాలు కోరుకుంటే దేవుని నుంచి జ్ఞానం మనకు అవసరం, దానికోసం దేవుణ్ణి అడుగుదాం.

ఒకే స్కూలు, ఒకే పాఠం విద్యార్థులందరికీ చెప్పబడుతుంది. అందరకీ ఒకే పుస్తకాలు, పరీక్షలు కూడా... కానీ కొందరికి ఎక్కువ మార్కులు కొందరికి తక్కువ మార్కులు వస్తాయి. ప్రతీ విద్యార్థికి బలం, బలహీనతలు ఉంటాయి. ఎక్కడ బలహీనంగా ఉన్నామో ఎవరికి వారే పరీక్షించుకొని దానిని జయించాలి, విజయం అంటే అందరికీ ఇష్టమే కానీ దానిని చేరుకునే సరైన దారి ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. మీరు సరైన నిర్ణయం తీసుకుని విజయాలు సాధిస్తారని ఈ Story ద్వారా మిమ్మల్ని ప్రోత్సాహపరుస్తున్నాను పిల్లలూ....

అనగనగా ఒక అడవిలో ఒక కోతిపిల్ల ఉండేది. అది తన అల్లరితో, వెర్రి చేష్టలతో అడవిలోని జంతువులకు కష్టం కలిగించేది. దాని అల్లరి భరించలేని జంతువులన్ని కలిసి, కోతిపిల్లకు వైద్య విద్యను నేర్పించేందుకు ఎలుగుబంటి దగ్గర శిష్యునిగా చేర్పించేందుకు తీసుకువెళ్తాయి. ఎలుగుబంటి అడవిలో ఏ ప్రతిఫలం ఆశించకుండా జంతువులకి వైద్యం చేస్తుంది. తనతోనే వైద్యం అంతరించి పోకూడదని, తగిన శిష్యుని కోసం వెదుకుతుంది. అలాంటి సమయములోనే కోతిపిల్లను శిష్యునిగా చేర్చుకోమని జంతువులన్ని ప్రాధేయ పడ్డాయి. అప్పటికీ ఎలుగుబంటికి కోతిపిల్ల గురించి తెలుసు, అయినా కూడా సరేనని ఒప్పుకొని దానిని సరైన దారిలో పెట్టాలనుకుంది. శిష్యుడిగా నిన్ను ఒప్పుకోవాలంటే ఈ అడవిలో **“దేనికి పనికిరానిది ఏదైనా”** నీకు కనబడితే దానిని నువ్వు తీసుకురావాలి, అప్పుడే నేను నా విద్యను నేర్పిస్తాను అని షరతు పెట్టింది ఎలుగుబంటి. “లోకంలో పనికిరానివి చాలా ఉన్నాయి, అవి తేవడం చాలా సులువు అలా వెళ్లి ఇలా తెచ్చేస్తా” అని ఒప్పుకుని బయలుదేరింది కోతిపిల్ల....

అలా అడవిలో వెళుతుంటే కోతిపిల్లకు పిల్లి ఎదురైంది. పిల్లిని అడిగితే “ఎలుకల్ని

పట్టుకోవాలంటే మనుష్యులకు నేనే గతి. వాళ్ళు నన్ను ప్రేమగా పెంచుకుంటారు తెలుసా?" అంది పిల్లి. నిరాశగా మరో దిక్కుకు బయలుదేరుతుంది, ఆవు కనబడితే విషయం చెప్పి తనతో రమ్మంది. "నా పాలను తాగి మనుష్యులు ఆరోగ్యం పొందుకుంటారు. నా పాలతో పెరుగు, నెయ్యి చేసుకుంటారు." అని చెప్పి ఆవు వెళ్ళిపోయింది, ఆ మాటలకి కోతిపిల్లకి తల తిరిగిపోయింది. "సృష్టిలో పనికి రానిదే లేదా?" అనుకుంటూ ఉండగా వృద్ధాప్యంలో ఉన్న ఒక వ్యక్తి కనిపించాడు. అతనికి నమస్కరించి తన సమస్య చెప్పింది కోతిపిల్ల... అప్పుడు ఆ వ్యక్తి "నీవల్ల ఏమి ఉపయోగం ఉందో చెప్పు"? అన్నాడు. ఎంత ఆలోచించినా తనవల్ల ఉపయోగ మేమిటో కోతిపిల్లకి ఒక్కటీ తోచలేదు.

"ఇప్పుడర్థమైందా? నీ విలువేమిటో? ఎలుగుబంటి చెప్పిందల్లా బుద్ధిగా విని వైద్యం నేర్చు కున్నావంటే నీవల్ల చాలా మేలు జరుగుతుంది. అప్పుడు పనికొస్తావు" అన్నాడు ఆ వ్యక్తి. అతనికి ధన్యవాదాలు చెప్పి ఎలుగుబంటి దగ్గరకి వెళ్ళి "నేను మాత్రమే పనికిరాని దాన్ని, ఎవరికీ నావల్ల ఉపయోగంలేదు. నాకు వైద్యం నేర్పించి పనికొచ్చే దానిగా మార్చండి" అని ఏడ్చింది కోతిపిల్ల. "నీలో గర్వం పోయిందనడానికి ఇదే సంకేతం, నేను నీకు వైద్యం నేర్పు తాను, బుద్ధిగా నేర్చుకో" అని శిష్యునిగా చేర్చుకుంది ఎలుగుబంటి.

అడవిలో జంతువులన్నీ సంతోషించాయి, కోతిపిల్ల ఆ రోజు నేను నుండి నేను కూడా ఇతరులకి ఉపయోగపడాలని పట్టుదలతో శ్రద్ధగా వైద్య విద్యను నేర్చుకుంది. తన గురువైన ఎలుగుబంటివలె ఏ ప్రతిఫలం ఇతరుల నుండి ఆశించేది కాదు. అడవిలోని జంతువులన్నీ కోతిపిల్లను ఎంతో గౌరవించేవి. ఎలుగుబంటి కూడా చాలా సంతృప్తిగా చనిపోతుంది. గురువుకి తగ్గ శిష్యుడుగా పేరు తెచ్చుకొని కోతి కూడా మంచిపేరు సంపాదించింది.

చూశారా పిల్లలూ! కోతి ఎక్కడ బలహీనంగా ఉందో పరీక్షించుకుని సరైన దారి నిర్ణయించుకుంది, పట్టుదలతో విద్యను నేర్చుకుంది. అంతేకాదు "తాను మాత్రమే పనికి రాని దానిని అని ఒప్పుకొని గురువుగారు పెట్టిన పరీక్షలో ప్రతిభను కనబరిచింది. జీవితం లోని పరిస్థితులను, పరీక్షలను ఎదుర్కోవడానికి దేవుని జ్ఞానం అవసరం, దానికోసం దేవుణ్ణి అడుగుదాం, విజయం సాధిద్దాం.... All the Best పిల్లలూ!

God Bless You

**ప్రేమతో**

**మీ అక్కయ్య**

# నా జీవితములో దేవుని మేలులు

-లక్ష్మి

నా పేరు లక్ష్మి, మాది విగ్రహారాధన కుటుంబం. మొదటిగా మా ఇంటిలో మా తల్లిగారికి అనారోగ్యం కలిగినప్పుడు అందరూ బ్రతుకదు అని అనుకున్నప్పుడు మా బంధువులలో ప్రార్థన చేసుకునేవారు తీసుకునివెళ్ళి ప్రార్థన చేసి బైబిల్ ఇచ్చి పంపించారు. అప్పటి నుండి అమ్మ యేసయ్య నన్ను బ్రతికించమని ప్రార్థించుకుంటూ ఉండేది. అలా మా అమ్మను దేవుడు స్వస్థపరచి, రక్షించాడు. అప్పటి నుంచి అమ్మ కుదిరితే చర్చ్‌కి వెళ్ళడం లేకపోతే ఇంటిలో ప్రార్థన చేసుకునేది. మేము ముగ్గురం సంతానం, నాకు ఇద్దరు అన్నయ్యలు, నేను చిన్నదానిని. ఇద్దరు అన్నయ్యలు తరువాత అమ్మ ఆపరేషన్ చేయించుకుంటాను అంటే మా నాన్నగారు అమ్మాయి కావాలి అనగా నేను జన్మించాను. నేను పుట్టడం కూడా దేవుని సంకల్పం అని అనుకుంటాను. తరువాత మా ఇంటిలో అమ్మ మాత్రమే ప్రార్థించుకునేది. నేను ఇంటర్మీడియట్ చదువుతున్న సమయములో ప్రార్థన చేసుకునేదాన్ని, తరువాత సెయింట్.థెరీసా కాలేజ్‌లో డిగ్రీ జాయినయ్యి, హాస్టల్లో ఉండేదాన్ని. అక్కడ ప్రేయర్ చేసుకునే వాళ్ళు గ్రూపుగా కూడుకొని ప్రేయర్ చేసుకునేవారు. నేను అక్కడికి వెళ్ళి, వాక్యం వినే దానిని కానీ ఆత్మీయంగా వాక్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలో నాకు తెలిసేది కాదు, అలా డిగ్రీ పూర్తి అయ్యింది.

తరువాత MSc పెద్ద తిరుపతిలో జాయినయ్యాను, ఆ ప్రాంతంలో కూడా దేవుడు నాకు ఒక సహవాసాన్ని చూపించారు. అక్కడ ఆత్మీయంగా ఎదుగుచూ, 2005వసం॥లో బాప్తీస్మము తీసుకోడానికి దేవుడు కృప చూపించారు. M.Sc కంప్లీట్ అయిన తరువాత నాకు వివాహం చేద్దామని ఇంటిలో సంబంధాలు చూస్తూ ఉండగా సంబంధాలు కుదిరేవి కాదు. అప్పుడు మా నాన్నగారు మా అమ్మని నువ్వు ప్రార్థన చేసుకోవడం వలనే ఇలా అవుతుందని అంటున్నారని మా అమ్మ నాకు చెప్పేది. నేను “దేవా! నీ చిత్తానుసారమైన భర్తను నాకు ఇవ్వమని” బాగా ప్రార్థన చేసుకునేదానిని. మా బంధువులందరూ వయస్సు పెరిగిపోతుంది ఇంకా పెళ్ళి చెయ్యరా అనేవారు. ఈ పరిస్థితులన్నింటిలో దేవుడు ఆయన చిత్తానుసారంగా నా వివాహమును జరిగించారు. నా భర్త జాబ్ రీత్యా మేము చెన్నైలో ఉండే వాళ్ళము. ఆదివారం ఆరాధనకు వెళ్ళాలి అని వెళ్ళేవారము కాని ఆత్మీయంగా ఉండేది కాదు.

తరువాత 2012వ సంవత్సరంలో చెన్నై నుండి హైదరాబాద్‌కి మారడం జరిగింది. మొదట ఒక సంవత్సరం కూకట్‌పల్లిలో ఉండి, తరువాత బోయినపల్లికి వచ్చాము. ఈ సమయములో చాలా చర్చ్‌లు మారాము చివరికి నాగారంలోని ఒక చర్చ్‌కి ప్రతివారం

వెళ్ళేవారము. నాకు అక్కడ కూడా అంత ఆత్మీయంగా అనిపించడం లేదు అని బాధ పడేదానిని. ఆ సమయములోనే మా కుటుంబమునకు జరిగిన యాక్సిడెంట్ నుండి దేవుడు తప్పించారు. ఈ విధంగా జరుగుతూ ఉండగా, మేము చెన్నైలో ఉండగా 2011వ సం॥లో కుదరవల్లి ప్రాంతంలో మాకు తెలిసినవారి వివాహంలో ఎపఫ్రా బ్రదర్ వాక్యం విన్నాము. అది గుర్తుకు వచ్చి, మన మినిస్ట్రీస్ ఆరాధన సమయములు, పరిచర్య గురించి తెలిసినవారిని కనుక్కొన్నప్పుడు చింతల్‌లో ఆరాధన ఆదివారం సాయంత్రం జరుగుతుందని చెప్పారు. అలా 2016వసం॥ నుండి మేము మన పరిచర్యకు రావడం ప్రారంభించాము. మేము వచ్చిన రోజు దేవుడు మాతో మాట్లాడిన మాట “నమ్మకత్వం”. అలా మేము ప్రతి ప్రార్థనకు ఆసక్తితో వచ్చి వాక్యం వినడానికి, ఆత్మీయంగా ఎదగడానికి దేవుడు సహాయం చేసి మమ్ములను నడిపిస్తున్నారు. అలాగే మనస్థత్త్వ విధానముల గురించి చెప్పబడిన వాక్యము, అబద్ధాలలో జీవిస్తున్నామా అనే వాక్యాలు ఎంతగానో మమ్ములను ఆత్మీయంగా బలపరిచాయి.

అలాగే ఇక్కడికి వచ్చిన మొదటి దినములలో ఉపవాస ప్రార్థన అంటే అబ్బా రోజంతా ఉండాలా అని ఆసక్తి లేకుండా ఉండేవారము కాని పరిచర్యలోని క్రమము, వాక్యముల ద్వారా మా కుటుంబమంతా ఆసక్తిగా ఉపవాసప్రార్థనలో ఉండడానికి, ఆత్మీయంగా ఎదగడానికి దేవుడు సహాయం చేశారు. కరోనా సమయములో కూడ ఆత్మీయంగా పడిపోకుండా దేవుడు వాక్యం ద్వారా బలపరిచారు. మరిముఖ్యముగా ఆరోగ్యం గురించి కూడా ఇక్కడ చెప్పే మాటలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. దేవుడు నన్ను, నా కుటుంబాన్ని ఈ సహవాసంలోకి తీసుకొని వచ్చినందుకు దేవునికి లెక్కలేని కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తున్నాను. మా జీవితకాలమంతా ఆత్మీయంగా జీవించుచూ, దేవునికి నమ్మకమైనవారిగా ఉండాలి అనేది మా ఆశ, మా కొరకు మీరందరూ ప్రార్థించగలరు.

YouTube లైవ్

ఆదివారం ఆరాధన
ఉ.9.30 గం.ల నుండి
వీక్షించగలరు.

YouTube Channel Name: **DEVUNI SPARSHA**

# చివరి మాటలు

సాధారణంగా మరణించే వ్యక్తి నుండి వచ్చే చివరి మాటలు చాలా ముఖ్యమైనవి. ప్రజలు ఆ చివరి మాటలకు చాలా గౌరవం మరియు ప్రాముఖ్యత ఇస్తారు. కావలసిన వ్యక్తుల చివరి మాటలు వినలేదని కొంతమంది బాధపడటం కూడా చూస్తుంటాం. ఎందుకు ఈ చివరి మాటలు అంత ప్రాముఖ్యమైనవంటే, అవి ఆ వ్యక్తి యొక్క జీవితపు సారాన్ని క్లుప్తంగా వివరిస్తాయి అంతేకాకుండా మరణించాక ఆ వ్యక్తి నిత్య జీవితంలో ఎక్కడికి చేరవచ్చో కూడా తెలియజేస్తాయి. ఈ లోకంలో చాలామంది వారు చనిపోయేముందు వారి జీవితాన్ని సరిచేసుకోవాలి అనుకుంటారు. చనిపోయేముందు వారికి సమయం దొరికితే ఆ బెడ్ మీదనుండే వారి జీవితములో ఎవరికైనా అపకారం చేస్తే వారిని క్షమాపణ అడగడం, కుటుంబసభ్యులతో చివరిగా వారి సంబంధాన్ని మెరుగుపరచుకోవడం చేస్తుంటారు. కానీ మనలో చాలా మందికి అటువంటి అవకాశం రాదు. ఎందుకంటే మనం ఎప్పుడు, ఎలా మరణిస్తామో మన చేతుల్లో లేదు. అందుకే చివరి మాటలు వినే అవకాశము వస్తే, వాటికి ప్రజలు అంత ప్రాముఖ్యత ఇస్తారు.

**చరిత్రలో కొంతమంది గొప్ప క్రైస్తవులు చనిపోతున్న సమయములో చాలా మంచి మాటలు చెప్పారు. ఉదాహరణకు కింద ఉన్న మాటలు రక్షణవైపునకు ప్రేరేపిస్తాయి.**

**విలియం కేరీ (భారతదేశంలో పరిచర్య చేసిన మిషనరీ):** "నేను మరణించిన తరువాత, డా.కేరీ గురించి తక్కువ మాట్లాడండి. డా.కేరీ గారి రక్షకుని (యేసు క్రీస్తు) గురించి మరింత ఎక్కువగా మాట్లాడండి". (When I am gone, speak less of Dr. Carey and more of Dr. Carey's Savior)

**జోనాథన్ ఎడ్వర్డ్స్ :** దేవునియందు విశ్వాసము ఉంటే, నీవు భయపడాల్సిన అవసరం లేదు.

**మరికొంతమంది దేవుని నమ్మనివారు, చనిపోతూ భయంతో ఈ మాటలు అన్నారు.**

**కార్డినల్ బోర్గియా:** నా జీవితములో బ్రతకడానికి కావలసినవన్నీ సమకూర్చుకున్నాను ఒక్క చావుకి తప్ప. అయ్యో! ఇప్పుడు సిద్ధపడకుండానే మరణిస్తున్నాను.

**థామస్ హాబ్స్:** అంధకారములోనికి దూకడం ద్వారా నా చివరి ప్రయాణాన్ని మొదలు పెడుతున్నాను.

మనుష్యుల యొక్క చివరి మాటలకే మనం ఇంత ప్రాధాన్యత ఇస్తుంటే, మానవాళి ముక్తి కొరకు సిలువపై మరణించిన, దేవుని కుమారుడు, లోకరక్షకుడు అయిన యేసుక్రీస్తు వారి యొక్క మాటలకు మనం ఇంకెంత ప్రాధాన్యత ఇవ్వాలి. యేసుక్రీస్తు ప్రభువు సిలువపై

మరణించే ముందు పలికిన 7మాటలు ఎంతో ముఖ్యమైనవి. ఈ మాటలు ఆయన జీవితానికి, ఆయన ఇచ్చిన సందేశానికి, మనయందు ఆయనకి ఉన్న ప్రేమకు నిదర్శనాలు. ఆ సిలువపైన యేసుక్రీస్తు చేసిన కార్యము, మానవుని యొక్క పాప విమోచనకు, తండ్రియైన దేవునికి మరియు పాపులైన మానవులకు మధ్య సంబంధాన్ని బాగు చేయడానికి ఎంతో ముఖ్యమైనది.

**ఆ సిలువపై యేసుక్రీస్తు ప్రభువు పలికిన ఆ 7మాటలను ఇప్పుడు ధ్యానిద్దాం**

1. **"తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను . వారు ఆయన వస్త్రములు పంచుకొనుటకై చీట్లు వేసిరి."లూకా 23:34**

చరిత్రకారుల ప్రకారం అన్ని మరణాలలోకెల్లా సిలువపైన మరణం చాలా భాధాకర మైనది. ఈ సిలువ మరణం భరించలేని హింసతో కూడుకున్నది. అందుకే రోమీయులు దీనిని దోషులను శిక్షించే పద్ధతిగా ఎంచుకున్నారు. సిలువ శిక్ష విధించిన వారిని మొదట బట్టలు విప్పి, ప్రత్యేకముగా తయారు చేసిన ఒక కొరడాతో వారిని దెబ్బలు కొడతారు. ఈ కొరడా తయారు చేయడానికి పదునైన గొర్రెఎముకలు, పదునైన లోహములు ఉపయోగిం చేవారు. అటువంటి కొరడాతో దోషుల వీపుపై కొడుతూ ఉంటే, ఆ పదునైన ఎముకలు, లోహములు చర్మాన్ని లోతుగా గుచ్చుకుని, చర్మాన్ని రక్తముతో తొలిచేసేది. అటువంటి బాధలో, హింసలో ఉన్న వారితోనే సిలువను కూడా మోయిస్తారు. ఆ సిలువ బరువు సుమారు 50 కిలోలు ఉండొచ్చు. సిలువ వేసే చోటుకి వచ్చిన తరువాత, దోషులని సిలువ పై పెట్టి వారి చేతులకు, కాళ్లకు మేకులు కొడతారు. ఆ మేకులు కూడా రక్తము ఎక్కువ పో కుండా నరాలు తెగిపోకుండా కొడతారు. ఇలా చేస్తే ఎక్కువ సమయం చనిపోకుండా శిక్షను అనుభవిస్తారని వారు ఇలా చేస్తారు. ఇటువంటి పరిస్థితిలో ఊపిరి తీసుకోవడానికి చాలా కష్టం. ఇటువంటి భయంకర శిక్షను యేసు అనుభవిస్తున్నారు.ఎందుకు?ఆయన ఎటువంటి పాపం చేయలేదు కానీ మీకోసం, నా కోసం ఆయన మరణించాడు. మన పాపముల యొక్క శిక్షను మనకు బదులుగా ఆయన అనుభవించాడు. ఆ కొరడా దెబ్బలు మనం తినాలి, ఆ సిలువపైన మనం ఉండాలి కానీ మనకు బదులుగా ఆయన ఉన్నాడు. అటువంటి భయంకరమైన బాధలో ఉన్నా కూడా ఆయన ఇంకా మన గురించే ఆలోచిస్తు న్నారు. మనల్ని క్షమించమని పరలోకపు తండ్రిని వేడుకుంటున్నారు..

ఈ మొదటి మాటలో మనము రెండు విషయాలు నేర్చుకోవచ్చు..

**క్షమాపణ:-** చివరి సమయములో కూడా యేసు క్షమాపణ గురించి బోధిస్తున్నారు. క్షమాపణ ఎంత ముఖ్యమైనదో దీనిని బట్టి అర్ధం చేసుకోవచ్చు. ఆయన పరిచర్యలో చాలా

మంది పాపములను క్షమించారు. ఈ సిలువ మరణం ద్వారా మానవాళి పాప క్షమాపణకు ఆయన మార్గం ఏర్పరచారు. పరలోక ప్రార్థనలో కూడా యేసు క్షమాపణను గురించి చెబుతారు. ఇతరులను క్షమించటం గురించి అందులో నేర్పిస్తారు. మన జీవితములో క్షమాపణ ఈ విధముగా ఉందో ఆలోచిద్దాం.. ఇతరులను క్షమిస్తున్నామా? అంతే కాకుండా, మీలో ఎవరైనా ఇంకా పాప భారమును మోస్తూ ఉన్నారా? పాప క్షమాపణకు సిలువ వద్దకు రండి.

**గ్రహించుట:** యేసుప్రభువును రక్షకునిగా ప్రజలు అప్పుడు అంగీకరించలేదు, ఆయనే మెస్సయా, రక్షకుడని వారు గ్రహించలేదు. యేసు సిలువపైన ఉండగా, ఆ మార్గ మున వెళ్లువారు నీవు దేవుని కుమారుడవైతే నిన్ను నీవే రక్షంచుకో అని దూషించారు. అలాగే శాస్త్రులు, పెద్దలు కూడా ఆయనను అపహసించారు. అంతేకాకుండా యేసుతో పాటు సిలువ వేయబడిన దొంగలు కూడ ఆయనను అలాగే నిందించారు. వాళ్ళందరూ యేసే రక్షకుడని "గ్రహించలేకపోయారు". వారి నేత్రములు మూయబడినవి. అటువంటి వారి కోసము కూడా యేసు క్షమించమని ప్రార్థించారు. యేసే రక్షకుడని మనము తెలుసు కున్నామా? మనకోసం యేసు అనుభవించిన శ్రమలు, శిక్షను మనం గ్రహించామా? **ద్వితీ 21:23**లో చెప్పిన విధముగా మన కోసం యేసు శాపగ్రస్థుడయ్యారు.



# మనస్థత్త్వపు విధానములు

## విశ్వాసపు మనసు

(గతి సంచిక తరువాయి భగం)

**"యోసేపు తనకు అవసాన కాలము సమీపించినప్పుడు విశ్వాసమునుబట్టి ఇశ్రాయేలు కుమారుల నిర్గమనమునుగూర్చి ప్రశంసించి తన శల్యములను గూర్చి వారికి ఆజ్ఞాపించెను." హెబ్రీ 11:22**

యోసేపు తన విశ్వాసాన్నిబట్టి మేము ఐగుప్తు దేశమునకు పరదేశులుగా వచ్చాము కానీ నేను మరణించిన తరువాత కూడా దేవుడు తన ప్రజలకు తోడుగా ఉండి కాపాడుతాడు అని విశ్వసించాడు. యోసేపు అద్భుతమైన ఊహా చిత్రాన్ని మన ముందు ఉంచుతున్నాడు. అదే విధంగా అబ్రాహాము కూడా తనకు ఉన్నది ఒక్కడే కుమారుడైనప్పటికి, తన ద్వారా దేవుడు తరువాత కాలంలో తన సంతానమును ఆకాశ నక్షత్రాలవలె, సముద్రతీరమందలి ఇసుకవలె విస్తరింప చేసి తన వాగ్దానాన్ని నెరవేర్చుతాడు అని చూస్తున్నాడు. అలాగే అబ్రాహాము దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడైయున్నాడో పునాదులు కలిగిన ఆ పరలోకపు పట్టణం కొరకు విశ్వాసపు దృశ్యంలో చూస్తున్నాడు. విశ్వాసంతో ఉన్నప్పుడు దేవుడు మన కన్నుల ఎదుట ఉంచిన దానిని ఆయన ఖచ్చితంగా నెరవేర్చడానికి సమర్థుడు. నీ వ్యక్తిగతంగాను, నీ కుటుంబంలోను, ఆత్మసంబంధమైన విష యములలోను, మరి అది ఏదైనప్పటికీ ఆయన అద్భుతంగా నెరవేర్చేవాడు. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపుల వాగ్దానముల నెరవేర్పును మనం చూస్తున్నాం.

కొంతమంది మాటలు చిన్న సమస్య రాగానే ఇక ఏమీ చేయటానికి లేదు అన్నట్లు ఉంటాయి. ఇస్సాకు బావిని త్రవ్వించినప్పుడు నీళ్ళు రాగానే అతని శత్రువులు ఆ బావి మాది అని గొడవపడ్డారు. అప్పుడతను నేను మరొక చోట బావిని త్రవ్వినప్పుడు కూడా దేవుడు నీటిని దయచేస్తాడు అనే విశ్వాసంతో బావిని త్రవ్వించాడు. విశ్వాససంబంధమైన జీవితం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. విశ్వాసపు మనస్సు లేనివాడు ఎప్పుడూ నిరాశకు, నిస్పృహకు, ఆందోళనకు, కలవరానికి, భయానికి, చింతకు గురవుతూ ఉంటాడు.

**"మోషే పుట్టినప్పుడు అతని తల్లిదండ్రులు ఆ శిశువు సుందరుడైయుండుట చూచి, విశ్వాసమునుబట్టి రాజాజ్ఞకు భయపడక, మూడు మాసములు అతని దాచిపెట్టిరి." హెబ్రీ 11:23**

మోషే యొక్క తల్లిదండ్రులు విశ్వాసమును బట్టి రాజు యొక్క ఆజ్ఞకు భయపడకుండా అతనిని మూడునెలలు దాచి ఉంచారు. దేవుడు పరిస్థితులను మారుస్తాడని నమ్మిక కలిగి ఉన్నారు, మనమైతే తొందరపడే వారిగా ఉంటాము. ఏదో ఒక విధంగా నా పరిస్థితులు

మారతాయి అని ఆలోచించేవారిగా ఉండాలి. ఒక్కరోజులో సమస్యకి పరిష్కారం వచ్చే యాలి అని చూడకూడదు. వారు మూడునెలలు దాచిపెట్టిన దానికి ఒకరోజు ప్రతిఫలం వచ్చింది. అదేమిటంటే దేవుడు మోషేను రాజు యొక్క కుమార్తె చేతుల్లోకి వెళ్ళేటట్లు చేసి పరిస్థితులు మార్చాడు. అందరూ భయపడినట్లు మోషే తల్లిదండ్రులు కూడా భయపడి అతనిని వెంటనే పారవేసి ఉంటే మోషే ఉండేవాడు కాదు. నువ్వు విశ్వాసముతో ఉంటే దేవుడే కార్యము జరిగిస్తాడు.

**"మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమును బట్టి ఇగుప్తు ధనముకంటె క్రీస్తువిషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని। అల్పకాలము పాపభోగము అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి, ఫరో కుమార్తె యొక్క కుమారుడని అనిపించుకొనలేదు; ఏలయనగా అతడు ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమందు దృష్టి యుంచెను." హెబ్రీ 11:24-26**

మోషే రాజుగారి కుమారుడుగా గొప్ప ధనానికి వారసుడు, విశ్వాసాన్ని బట్టి ఐగుప్తు ధనముకంటే క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని ఎంచుకొన్నాడు. తన ప్రజల కొరకు జీవించటం భాగ్యమని ఎంచుకొన్నాడు. విశ్వాసాన్నిబట్టి వెళ్ళే వ్యక్తి జీవితం ద్వారా అనేక మంది క్షేమంగా ఉంటారు, ధైర్యపరచబడతారు, ఆశీర్వదించబడతారు. అనేకమంది మరణములో నుండి జీవములోనికి వెళ్తారు. మన నోట నుండి విశ్వాససంబంధమైన మంచి మాటలు రావాలి. మోషే ఫరో కుమార్తె యొక్క కుమారుడనని అనిపించుకోవటానికి ఇష్టపడలేదు కానీ దేవుని ప్రజలతో శ్రమ అనుభవించడానికి ఇష్టపడ్డాడు. మోషే యొక్క నిర్ణయం అతనిని నాయకునిగా చేసింది. మోషే పెద్దవాడైనప్పుడు లక్షలమంది బానిసత్వ పుస్థితి నుండి విడిపించబడ్డారు. విశ్వాససంబంధులు ఎప్పుడూ ప్రోత్సాహపరచే అనుకూల మైనమాటలు మాట్లాడితే, అవిశ్వాసులు ఎప్పుడూ నిరుత్సాహపరచే ప్రతికూలమైన మాటలు మాట్లాడుతారు.

**"విశ్వాసాన్నిబట్టి అతడు అదృశ్యుడైనవానిని చూచుచున్నట్టు స్థిరబుద్ధిగలవాడై, రాజా గ్రహమునకు భయపడక ఐగుప్తును విడిచిపోయెను." హెబ్రీ 11:27**

అదృశ్యుడైన వానిని చూచుచున్నట్లు నిర్ణయం తీసుకోవాలి కానీ పరిస్థితులనుబట్టి కాదు. చుట్టూ ఉన్న మనుష్యులనుబట్టి అయితే అందరికి సంతోషం కలిగించే నిర్ణయాలు తీసుకోవాలి కానీ అదృశ్యుడైనవానిని చూస్తున్నట్లు నిర్ణయాలు తీసుకోవల్సి వచ్చినప్పుడు, వారికి చాలా బాధాకరంగా ఉంటాయి, కొందరికి కోపాన్ని తెప్పిస్తాయి. మనం చూచుచున్న వారిని బట్టి నిర్ణయాలు తీసుకోకుండా అదృశ్యుడైన దేవునిని చూస్తూ నిర్ణయాలు తీసుకొనే వారిగా ఉండాలి. విశ్వాసపుమనస్సు లేనివారు ఇతరులను సంతోషపెట్టాలని మాట్లాడుతారు.

**“తొలిచూలు పిల్లలను నాశనము చేయువాడు ఇశ్రాయేలీయులను ముట్టకుండు నిమ్మిత్తము అతడు విశ్వాసమునుబట్టి పస్కాను, రక్తప్రోక్షణ ఆచారమును ఆచరించెను” హెబ్రీ 12:28**

ఐగుప్తు దేశములో దేవునిఉగ్రత వలన తొలిచూలు పిల్లలందరూ చనిపోతారని, వారి మీదకు మాత్రమే దేవుని ఉగ్రత వస్తుంది, మన మీదకు రాదు కాబట్టి మీరు ధైర్యముగా ఉండమని మోషే ఇశ్రాయేలు ప్రజలతో చెప్పాడు. అతను విశ్వాసంతో చెప్పిన ఆ మాట వలన ఇశ్రాయేలు ప్రజలలో తొలిచూలు పిల్లలెవ్వరు చనిపోలేదు, వారందరూ క్షేమంగా ఉన్నారు. అంటే విశ్వాసాన్నిబట్టి మాట్లాడేమాటల్లో ఎంతశక్తి ఉంటుందో చూడండి. దేవుడు మోషేతో కర్రను సముద్రము మీద చాపమని చెప్పినప్పుడు ఎఱ్ఱ సముద్రంలో నీళ్ళు రెండువైపులా గోడవలే నిలిచిపోయాయి. దేవుని ప్రజలు విశ్వాసంతో పొడి నేల మీద నడిచి వెళ్లారు. ఐగుప్తీయులు కూడా అలాగే నడవాలని ప్రయత్నించి సముద్రములోపడి మునిగి పోయారు. విశ్వాసం లేకుండా అందరూ చేస్తున్నారని చేస్తే అలాగే మునిగిపోతారు. ఎవరో నిర్ణయాలు తీసుకొన్నారని మనం కూడా విశ్వాసం లేకుండా నిర్ణయాలు తీసుకోవటం వలన ఎంతో నష్ట పోతాము.

**“విశ్వాసమునుబట్టి యేడు దినములవరకు ప్రదక్షిణము చేయబడిన తరువాత యెరికో గోడలు కూలెను.” హెబ్రీ 11:30** యెరికో గొప్ప ప్రాకారముగల పట్టణమైనప్పటికీ వారు విశ్వాస ముతో ప్రదక్షిణము చేసిన తరువాత దాని గోడలు కూలిపోయాయి. నీ పరిస్థితులు ఏమైనా సరే నువ్వు విశ్వాసంతో జీవించాలి కాబట్టి అధైర్యపడకు. మన యేసయ్య మన పరిస్థితుల న్నింటిని అద్భుతంగా మార్చగలిగినవాడు. ఆయనకు అసాధ్యమైనది ఏది లేదు, నిన్ను ప్రేమిస్తున్నాడు, నీకొరకు ప్రాణం పెట్టాడు. ఆయన నీ తండ్రి కాబట్టి నువ్వు దిగులుపడకు, దేవుడు తన సొంతకుమారున్ని అనుగ్రహించాడు, నీ కొరకు సమస్తమును అనుగ్రహిస్తాడు. ఎప్పుడు ఏమి జరిగించాలో మన దేవునికి తెలుసు. ఎందుకు మనకు అటువంటి పరిస్థి తులను అనుమతించాడో దాని వెనుక తప్పకుండా ఒక కారణం ఉంటుంది. యేసుక్రీస్తు యొక్క శిష్యులు కూడా రాబోయేకాలంలో ఈ భూమి మీద అనేకమంది ప్రజలు ఆయన నామాన్ని యెరుగుతారు అనే విశ్వాసంతో దేవునిసువార్తను ప్రకటించటం ప్రారంభించారు, దానివల్ల కోటానుకోట్లమంది రక్షించబడ్డారు. దేవుడు అప్పగించిన పనిని విశ్వాసంతో జరిగించాలి. నీకు విశ్వాసపుమనస్సు లేకపోతే విశ్వాసపు మనస్సు దయచేయమని దేవునిని అడుగు. విశ్వాసపు మనస్సు కలిగిన నిన్ను దేవుడు శ్రేష్టమైన వానిగా చేస్తాడు. దేవుడు అట్టి ధన్యత దయచేయునుగాక.

**ఇంకా ఉంది**

# దైవ చిత్తాన్వేషణ

**-యౌవనుల ప్రత్యేకము (సేకరించబడింది)**

గడచిన సంచిక తరువాయి భాగం

కేవలం మనస్సాక్షి మాత్రమే ప్రభువు యొక్క స్వరము కానేరదు. మనస్సాక్షి అనేది ఒక వ్యక్తి తన జీవితంలో కలిగియున్న నియమములనుబట్టి అవగాహన కలిగియుండి మలచబడుతుంది. కాని బైబిల్ యొక్క బోధకు ఎల్లప్పుడూ విధేయత చూపిస్తున్న కొలదీ, దేవుని యొక్క ప్రమాణములను ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. మన మనస్సాక్షిని నిర్మలముగా ఉంచుకొన్నట్లయితే, మన జీవితములలో దేవుని యొక్క వెలుగు ప్రకాశిస్తుంది - ఆవిధముగా ఆయన చిత్తమును మనము తెలుసుకొనవచ్చును అని **లూకా సువార్త 11:34** లో వాగ్దానం ఉన్నది. మన అనుదిన జీవితములలో, మనస్సాక్షి యొక్క స్వరము వినుటకు తప్పిపోయినట్లయితే, దేవుని యొక్క నడిపింపును వెదికేటప్పుడు ఆత్మ యొక్క స్వరమును వినుటలో మనము తప్పిపోతాము. దేవుడు ఎప్పుడైతే మనతో మాట్లాడతాడో వెంటనే దానికి విధేయత చూపుట అనేది నడిపింపులో గల ఒక రహస్యము.

కొద్దికాలము క్రితము 15 సంవత్సరములు వయస్సు గల పుట్టుగ్రుడ్డివాడైన ఒక బాలుడు విమానములో ఎగిరి దానిని భద్రముగా దించినట్లు నేను చదివాను. ఇటువంటి అసాధారణమైన సాహసం, తనకు సూచనలిచ్చు పైలెట్ ఇచ్చు ఆజ్ఞలకు వెంటనే విధేయత చూపడం ద్వారానే చేయగలిగాడు. జీవితములో అనేక సమస్యలు మనము ఎదుర్కొంటున్నప్పుడు, ఒక గ్రుడ్డివాడు తనకు తెలియని మరియు కనబడని మార్గములో విమానమును దించుటకు ప్రయత్నించినట్లు మనకు అనిపించవచ్చును. కాని దేవుని యొక్క ఆజ్ఞలకు వెంటనే విధేయత చూపించుట మనము అలవాటు చేసుకొనినట్లయితే, మనము భద్రముగా దిగివచ్చెదము.

**షరతులు లేకుండా అప్పగించుకొనుట:-**

**"పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడి.....ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవునిచిత్తమేదో (మీరు) పరీక్షించి తెలిసికొనెదరు...."(రోమా 12 :1,2)**

మనము ప్రభువుకు దాసుల (జీవితకాలం బానిసలు)ముగా కావలెనని క్రొత్తనిబంధన మనలను హెచ్చరించుచున్నది. పౌలు తనను యేసుక్రీస్తు ప్రభువుకు దాసునిగా ఇష్టపడి పిలుచుకున్నాడు. పాతనిబంధనలో రెండు రకములైన దాసులు ఉండేవారు. దాసుడు (జీవితకాలపు బానిస) మరియు జీతమునకు పెట్టుకొన్న సేవకుడు. దాసునికి సేవకుని వలె జీతము ఇవ్వబడదు. అతడు తన యజమానిచేత వెలపెట్టి కొనబడతాడు -కాబట్టి దాని

ఫలితముగా, అతడు మరియు అతనికి కలిగినదంతయు తన యజమానుడికి చెందుతుంది. ప్రతి యొక్క విశ్వాసి తనకు తానుగా ఈ విధముగా గుర్తించబడవలెను. మనము సిలువలో విలువపెట్టి కొనబడినవారము గనుక మన సమయము, ధనము, తలాంతులు, కుటుంబములు, ఆస్తులు, మనస్సులు, శరీరములు– సమస్తము– మన ప్రభువు మరియు యజమానుడైన ఆయనకే చెందుతాయి **(1కొరింథీ 6: 19, 20)**.

కాబట్టి దేవునికి మన శరీరములను ఒక్కసారే సజీవయాగముగా పాతనిబంధనలోని దహనబలి అర్పించినట్లుగా అర్పించమని మనము హెచ్చరింపబడ్డాము. దహనబలి, పాప పరిహారార్థబలివలె కాకుండా సమస్తమును దేవునికి అర్పించును మరియు అర్పించువాని సంపూర్ణ ప్రతిష్టను అది చూపించును. ఒక వ్యక్తి దహనబలి అర్పించినప్పుడు, తిరిగి అతడు ఏమీ తీసుకోలేదు (పొందలేదు). ఆ అర్పణ యెడల దేవుడు తనకిష్టమొచ్చినట్లు చేయును. **"తండ్రీ, నా చిత్తము కాదు మీ చిత్తమే నెరవేర్చబడును గాక"** అని తన తండ్రితో చెప్పి తనంతట తాను తండ్రికి అప్పగించుకొనిన కలువరి సిలువకు ఇది సాదృశ్యము. మన శరీర ములను సజీవయాగముగా అర్పించుట అనగా అర్థము ఇదే: ఆయనచేత మన శరీరము (దేహము) ఎక్కడ, ఎలా ఉపయోగించబడాలి అనే విషయములో మన స్వంత చిత్తమునకు మరియు ఇష్టములకు చనిపోవాలి. ఆ విధముగా మాత్రమే మనము ఆయన చిత్తమును తెలిసికొనగలము.

సాధారణముగా అటువంటి అప్పగింపు (లోబడుట) తక్కువగా ఉండుటే మనము దేవుని చిత్తమును నిశ్చయపరచుకొనలేకపోవుటకు ముఖ్య కారణము. మనము ప్రభువుకు అప్పగిం చుకునే విషయములో అనేకసార్లు రిజర్వేషన్లు (పరిమితులు, షరతులు) కలిగి ఉంటాము. దేవుడిచ్చు దేనినైనా అంగీకరించుటకు మనము నిజముగా సిద్ధపడియుండము. పూర్తి కాలపు సేవ తప్ప ఎటువంటి వృత్తి (ఉద్యోగము)నైనా స్వీకరించుటకు ఇష్టపడిన ఒక సహోదరుని ఒకసారి కలిశాను. ఈ రిజర్వేషన్(షరతే) తన జీవితముపట్ల దేవుని యొక్క ప్రణాళికను స్పష్టముగా తెలుసుకోకుండా చేస్తుందని చెప్పాను. చివరకు ఆయన ప్రభువుకు సంపూర్ణముగా అప్పగించుకొనినప్పుడు, వెంటనే దేవుని యొక్క చిత్తమును గూర్చిన లోతైన నిశ్చయతను పొందాడు. దేవుడు అతనిని పూర్తి కాలపు క్రైస్తవ సేవకు పిలువలేదు గాని అతడు సిద్ధపడి ఉండాలని దేవుడు కోరుకున్నాడు.

**సేకరించబడింది**

**ఇంకా ఉంది**

# HOW PETER BECAME A DISCIPLE

**Youth Special**

By itself, conscience is not the voice of God, for it is educated and determined by the principles on which a person bases his life. But if it is obeyed constantly and brought in line with the teaching of the Bible, it will reflect God's standard increasingly. The promise in Luke 11:34, then is, that if we keep our conscience clean we shall have God's light flooding our lives - and thus we shall know His will. If we fail to listen to the voice of conscience in our daily lives, we shall fail to hear the voice of the Spirit when seeking God's guidance. Instant obedience to God whenever He speaks to us is one of the secrets of guidance.

Recently, I read of a fifteen-year-old boy, blind from birth, who flew and landed an aircraft safely. This remarkable feat was accomplished by his instantly obeying every order given by his instructor pilot. When facing life's manifold problems, we may feel like blind men trying to land a plane on an unknown and invisible runway. But if we develop the habit of instant obedience to God's commands, we shall find that we land safely.

## Unconditional Yieldedness

Make a decisive dedication of your bodies - presenting all your members and faculties - as a living sacrifice, holy and well pleasing to God....o that you may prove (for yourselves) what is the good and acceptable and perfect will of God (Romans 12:1, 2).

The New Testament exhorts us to become bondslaves to the Lord. Paul called himself a willing bondslave of Jesus Christ. In the Old Testament, there were two classes of servants - the bondslave and the hired servant. A bondslave, unlike the hired servant was never paid. He was bought by his master for a price and as a result all that he was and all that he possessed belonged to his master. This is what every believer must recognize himself to be. Our time, money, talents, families, possessions, minds and bodies - all - belong to our Master and our Lord, for they are His by right of purchase on the Cross (1 Corinthians 6:19, 20).

We are therefore exhorted to present our bodies to God, once for all, as a living sacrifice, even as the burnt offering in the Old Testament. The burnt offering, unlike the sin offering, was wholly offered to God and signified the offerer's utter dedication unto Him. When a man offered a burnt offering, he received nothing back. God could do whatever He liked with that offering. It was symbolic of Calvary's Cross where the Lord Jesus offered Himself utterly to His Father saying,

"Father, not My will but Thine be done."

This is what it means to present our body as a living sacrifice to God: we must die to our own will and choice as to how and where our body should be used by Him. Only thus can we know His will.

Lack of such yieldedness is usually the main reason why we are unable to ascertain God's will. Our yieldedness to the Lord is often with reservations. We are not really willing to accept anything that God may offer.

I met a brother once who was willing to take up any vocation except full-time Christian service. I told him that it was this reservation that kept him from being clear about God's plan for his life. When he finally yielded all to the Lord, he immediately gained a deeper assurance of God's will. God did not call him to full-time Christian service, but He wanted him to be willing.

**To be continued...**




# బైబిల్ క్విజ్ -93

## యోహాను సువార్త నుండి ఇవ్వబడినవి.

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** “వీరికంటే నీవు నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా?” అని యేసు ఎవరిని, ఎన్నిసార్లు అడిగాడు?

**2.** ఒక మనుష్యుడు ప్రజలకొరకు చనిపోవుట ప్రయోజనకరమని ఆలోచన చెప్పినదెవరు?

**3.** మీ ధర్మశాస్త్రం ప్రకారం యేసుకు తీర్పు తీర్చమని యూదులకు చెప్పిందెవరు?

**4.** దేవుని మెప్పుకంటే మనుష్యుల మెప్పును ఎక్కువగా ఆపేక్షించింది ఎవరు?

**5.** “నీవు దేవున్ని ఏమడిగినను, దేవుడు నీకనుగ్రహించును” అని ఎవరు ఎవరితో చెప్పారు?

**6.** “ఆయనతోకూడ చనిపోవుటకు మనమును వెళ్లుదము”అని ఏ శిష్యుడు తనతోటి శిష్యులతో చెప్పాడు?

**7.** యోహాను సువార్తలో మూల వచనం ఏది?

**8.** ‘ఇదిగో ఇతడు నిజముగా ఇశ్రాయేలీయుడు, ఇతనియందు ఏ కపటమును లేదు’ అని ఎవరి గురించి ఎవరు చెప్పారు?

**9.** ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు? అని ఎవరు ఎవరిని అడిగారు?

**10.** యేసు స్వస్థపరచిన వ్యక్తి కోనేరు వద్ద ఎన్ని సంవత్సరాల నుండి రోగిగా ఉన్నాడు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఏప్రియల్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మే 2024 పత్రికలో ప్రచురించబడతాయి.

పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ -92 జవాబులు(లూకా నుండి ఇవ్వబడింది)**

**1.** జక్కయ్యతో యేసు చెప్పాడు (19:5)
**2.** పేతురు (22:33)
**3.** అపొస్తలులు (6:13)
**4.** మరియతో సుమెయోను చెప్పాడు(2:35)
**5.** డెబ్బైమంది (10:1)
**6.** యేసు (24:19)
**7.** 18సంవత్సరములు (13:11)
**8.** ఆకాశం, భూమి (16:17)
**9.** యాకోబు, యోహాను (9:54)
**10.** తూరు, సీదోను (6:17)

**<u>బైబిల్ క్విజ్ - 92 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

కొర్నేలి, మిరాకిల్ ప్రైసీ, ఎమ్.రాజుఫ్లోరెన్స్, రిత్విక్ జోయెల్, మాధవి, గణేష్, వీణా ప్రసన్న, త్రినాథరావు, ఐజాక్ కుమారి, ఉషారాణి (బి.హెచ్.ఇ.ఎల్)

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మార్చి-ఏప్రియల్

**భాగ్యలత** : రాజేశ్వరి, వసుంధర, శ్రీదేవి, స్వప్న, ప్రాముఖ్య, కోటేశ్వరి, రత్నాకర్, గోపీనాథ్, జ్యోతి, లత(యేసమ్మ), విక్రమ్‌కుమార్, సుమలత, నాగమణి, విస్మయ్, ఐలయ్య, వినోద్, సుష్మ, రూతు, బ్యూలా, జగన్, మేఘ, సాత్విక, హరీష్‌బాబు, రజని, సుహాసిని, హెప్సిబా, కృపారాణి, సిద్ధమ్మ, సువర్ణరత్న, పుష్పావతి, రిష్విన్‌రాజు, కీనస్విన్, యోజస్వి, షారోన్, అభినయ, బోయజ్, శ్రీవాణి, వెంకటరమణి, సురేష్, గోపీచంద్, పార్వతి, అరుణ, కిరణ్, జయశీల, రజిత, ప్రియాంక, నోయాగ్రేస్, నిరీక్షణ్, తేజ, నమ్రత, విజయకుమారి, కృష్ణవేణి, సింధూర, లలితాసాయి, ఎలీషాబాబు, అనూష, సూచన, బాలచంద్ర, ప్రసన్న, శేషగిరిరావు, అభిషేక్, విశ్వాస్, రాజేష్, జాన్‌విక్టర్, విజయ, వర్షిణి, శ్రీనివాసరావు, శ్రీదేవి, పద్మ, గోపాల్, రాజు, జీవన్, దీపిక, శ్యామల, పాధ్వీక, కెజియా, మధురిమ, వాత్సల్య, పద్మాకర్, పర్ణిక, జయ, కృపారావు, కళ, జిన్నిబాబు, ఏలియా, పుష్పలత, నోవా, శ్రీకాంత్‌రవి, సలోమియ,తిమోతి, మోజెస్, సుజాత, గీత, రాహుల్, గంగేయుడు, సందేశ్, బంధేశ్, గ్రీష్మ, మాధురి, జయమ్మ, నరసింహరావు.

**చింతల్** : రాజేష్, జయానంద్, బాలరాజు, రాణి, శ్రీకాంత్, స్నేహ, శాంతిప్రియ, విజయ్, రాధామణి, సూర్యదీపిక, శిరీష, జీవన్‌కుమార్, హేమకుమారి, సురేంద్ర, అనంతరావు, సుధాకర్, మైఖేల్, డేవిడ్, రాజామన్నార్, విజయ, మోహన్.

**ఆనాజ్‌పూర్ :** ప్రభుదాస్, మరియమ్మ, ఆనందరావు, ధనలక్ష్మి, శ్రావణి, రూతు, రమేష్‌బాబు, పీటర్, డేవిడ్ పాల్‌రాజ్, స్వాతి, ఆరాధన, కృపావరుణ్, మణెమ్మ, మహిమ, భిక్షపతి, జాస్మిన్, సిద్ధు, అక్షయ్‌కుమార్, అవినాష్, రాజేష్, సరోజిని, శశాంక్‌బాబు.

**ఇ.సి.ఐ.యల్ :** లలితా సాల్మన్.

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



# ఈస్టర్

ఈస్టర్ అనే పదము యేసుక్రీస్తుని విశ్వసించిన వారికి సుపరిచితమైనది. ఎందుకంటే ప్రతి సంవత్సరం ఒక ఆదివారం ఈస్టర్ సండేగా జరుపుకుంటారు కాబట్టి. అయితే యేసుక్రీస్తు మార్గములో జీవించని అనేకులు దీనిని గూర్చి పెద్దగా వినకపోయి ఉండవచ్చు. ప్రస్తుత పరిస్థితులలో క్రైస్తవ యవ్వస్థలలో కొందరు ఈస్టర్ సండే అనే మాట వినినప్పటికి, అది ఎందుకు ఏర్పడిందో, దేనికి ఆ రోజుని జరుపుకుంటారో వారికి తెలియదు అనుటలో అతిశయోక్తి లేదు. ఈస్టర్‌దినం ప్రారంభం ఏదైనప్పటికీ నేడు యేసుక్రీస్తు మరణమును గెలిచి, మూడవ దినమున సమాధి నుండి తిరిగి లేచిన సందర్భమునకు గుర్తుగా జరుపుకుంటారు. క్రైస్తవులలో అనేకులకు ఈస్టర్ అనేది ఒక పండుగ, దానిని అనేక విధాలుగా ఆచరిస్తూ ఉంటారు, కొందరు దానికి ఎటువంటి ప్రాధాన్యతా ఇవ్వరు. మనం ఏం చెయ్యాలి అని ఆలోచిస్తే, క్రీస్తు పునరుత్థానుడై లేచిన సందర్భం సంవత్సరానికి ఒకసారి ప్రత్యేకంగా జ్ఞాపకం చేసుకోవడం ఏ మాత్రం తప్ప కాదు. మామూలు మనుష్యులే తమ పుట్టిన దినములను ఎంతో ఆడంబరంగా జరుపుకుంటూ ఉండగా, మరియొక ప్రక్క చనిపోయిన నాయకుల జనన, మరణ దినములను ఎంతో గంభీరంగా జరుపుతూ ఉండడం మనం చూస్తున్నాము. అలాంటిది సర్వలోక మానవాళి కొరకు పరలోకమును విడిచి, భూమి మీదకు వచ్చి, సమస్త మానవాళి పాపముల కొరకు సిలువ వేయబడి, మూడవ దినమున తిరిగి లేచిన జగత్ రక్షకుని జ్ఞాపకం చేసుకోవడం ఎంతో అవసరం. పండుగా అనుకునే దానికంటే మన మరణం తరువాత జీవితమునకు ఈస్టర్ ఒక మేలుకొలుపు వంటిది.

ప్రతిఒక్కరూ యేసుక్రీస్తు తిరిగి లేచిన విధంగానే, ఆయనయందు విశ్వసించిన వారు మరణించిన తరువాత ఒకానొక రోజు తిరిగి లేచి యేసుక్రీస్తుతో కూడా నివసిస్తారు అనే విషయమును గుర్తు చేసుకోవాలి.

2024, జనవరి 26వ తేదీన జరిగిన ఉపవాస ప్రార్థనలో
విశ్వాసులు పాల్గొని దేవుని మహిమపరచుట జరిగినది.





# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by: T. Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-5000070, Hyderabad.*
*Printed by*: Charisma Printers Pvt. Ltd, # 6-1-91/37-40, Sensation Theatre Road, Lakadi-ka-pool, Hyderabad (TS) 500004 | Editor: Bro. T.Epaphras